సాక్షి సూర్యాపేట

గురువారం । 2 । మార్చి । 2023



వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జీఎం సీతారామ్ అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం

36° / 17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన దివ్య విమాన రథోత్సవం

న్యూస్‌రీల్

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు ఇంటి స్థలం పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, కలెక్టర్ వెంకట్రావు

కోదాదరూరల్ : ఇళ్లు లేని పేదలందరికీ నివేశనస్థలాలు ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 58 జీఓ ద్వారా లబ్ధిదారులకు మంజూరైన ఇంటి స్థలాల పట్టాలను కలెక్టర్ వెంకట్రావుతో కలసి అందజేసి మాట్లాడారు. 125 గజాలలోపు ప్రభుత్వ స్థలంలో ఇంటిని నిర్మించుకుని ఉన్నవారందరికీ ప్రభుత్వం మార్కెట్ ఫీజుతో పట్టాలు అందజేస్తుందన్నారు. దీంతో అనేక పేదలకు సొంతింటి కల నెరవేరినట్లు అయ్యిందన్నారు. ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఆదిశగా పనిచేస్తున్నామన్నారు. లక్ష్మీపురంతో పాటు శ్రీరంగాపురం, గుడిబండ గ్రామాలకు చెందిన 15 మందికి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్డీఓ కిషోర్‌కుమార్, ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసశర్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ నేతకాని వెంకన్న కోరారు. సంఘం పిలుపుమేరకు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లాకేంద్రంలోని విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్‌లో రావాల్సిన పీఆర్సీని ఉద్యోగులకు చెల్లించాలన్నారు. ఈపీఎఫ్, జీపీఎఫ్, ఆర్టిజన్ సమస్యలు పరిష్కరించాలని, అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ సురేష్, కో కన్వీనర్ దశరథ రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్.శ్రీనివాస్, డివిజన్ చైర్మన్ అబ్దుల్ రషీద్, యాదగిరి నాయుడు, దయాకర్ రెడ్డి, వెంకన్న, వెంకటనారాయణ, శ్రీనివాస్, రమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం ఖాయం



హుజూర్‌నగర్ : శివారెడ్డి నివాసంలో నాయకులతో జానారెడ్డి

హుజూర్‌నగర్ : రాబోయే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాముల శివారెడ్డి నివాసానికి వచ్చిన జానారెడ్డిని స్థానిక ఆపార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యకర్తలు ఎవరు కూడా అధైర్యపడవద్దని బెదిరింపులకు లొంగవద్దని ఆయన కోరారు. పార్టీ గెలుపు కోసం నాయకులు కార్యకర్తలు అందరూ కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గల్లా వెంకటేశ్వర్లు, నాయకులు సిద్ధార్థరెడ్డి, అజీజ్‌పాషా, రామరాజు, సుబ్బరాజు, బెంజిమెన్, సైదులు, సత్యనారాయణ, మట్టయ్య, ముత్తయ్య, రజాక్ బాబా, సుదర్శన్, రాము, సైదులు తదితరులు పాల్గొన్నారు..

3న తిరుమలగిరి మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో శుక్రవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

ఫోన్ చేయాల్సిన నంబర్ : 99485 40696



దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

గిరిజనుల ద్రోహి మోదీ

- గిరిజన రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు ప్రధాని కుట్ర
- బుల్డోజర్ రాజకీయాన్ని అడ్డుకుంటాం
- మాజీ ఎంపీ బృందా కరత్
- మిర్యాలగూడలో గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం

- 10లో▸



వామ్మో వంట గ్యాస్!

- ఒకేసారి డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50 పెంపు
- ప్రస్తుతం రూ.1176.50కి చేరిన ధర
- జిల్లాలో వినియోగదారులపై నెలకు రూ.55లక్షల అదనపు భారం



నాగారం : వంట గ్యాస్ ధర మరోసారి భగ్గుమంది. కొంత కాలంగా నిలకడగా ఉన్న గ్యాస్ రేట్లు భారీగా పెరిగాయి. 14.2కేజీ ఎల్‌పీజీ డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50, 19కేజీ కమర్షియల్ సిలిండర్‌పై రూ.350.50 పెంచారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు రూపంలో మరోషాక్ తగిలినట్లయ్యింది.

పెరిగింది ఇలా...

వంట గ్యాస్ సిలిండర్లపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసింది. కేవలం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన సిలిండర్లకు మాత్రమే రాయితీ ఇస్తోంది. దీనికితోడు గ్యాస్ ధరలను ఎడాపెడా పెంచుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. 2022 జూలై నుంచి 2023 ఫిబ్రవరి వరకు 14.2 కిలోల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,126.50గా ఉంది. ఈ ఎనిమిది నెలల పాటు వంట గ్యాస్ ధరలు పెరగకుండా నిలకడగా ఉన్నాయి. కానీ చమురు సంస్థలు మార్చి1న గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచింది. దీంతో రూ.1126.50గా ఉన్న వంటగ్యాస్ సిలిండర్ రూ.1,176.50కు చేరింది. గతంలో సిలిండర్ ధరలో సబ్సిడీ డబ్బులు తిరిగి వినియోగదారుని ఖాతాలో జమ అయ్యేవి. కానీ ప్రభుత్వం గ్యాస్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేడయంతో పూర్తి ధర రూ.1176.50లను వినియోగదారుడు భరించాల్సి వస్తోంది. రూ.2,145.50గా ఉన్న కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,496కు చేరింది.

గ్యాస్ ధరల పెరుగుదల ఇలా.. (సిలిండర్‌కు రూ.లలో)

నెల	పెంపు	పెరిగిన రేటుతో కలుపుకుంటే..
2023 మార్చి	50.00	1176.50
2022జూలై	50.00	1126.50
2022 మే	50.00	1076.50
2022 మార్చి	50.00	1026.50
2021 అక్టోబర్	15.00	1011.50
2021 సెప్టెంబర్	25.00	986.50
2021 ఆగస్టు	25.00	961.50
2021 జూలై	25.50	936.50
2021 మార్చి	50.00	886.50

పేద, మధ్య తరగతి వర్గాలపై భారం

జిల్లాలో మూడు కంపెనీలకు చెందిన 14 సాధారణ డిస్ట్రిబ్యూటర్లు, 12 గ్రామీణ వితరక్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. ఈ 26 ఏజెన్సీల పరిధిలో సింగిల్ సిలిండర్లు 1,91,988, డబుల్ సిలిండర్లు 69,937, దీపం పథకం 45,944, ఉజ్వల 56,011, కార్పొరేషన్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) 42,018 ఇలా మొత్తం 4,05,898 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో వినియోగదారులు 3,68,260 మంది ఉన్నారు. జిల్లాలో నెలకు సరాసరి 1,10,000 సిలిండర్లు పంపిణీ జరుగుతాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంచడంతో పేద, మధ్యతరగతి వినియోగదారులకు నెలకు రూ.55లక్షల అదనపు భారం పడనుంది.

గ్యాస్ ధర పెంపు సరికాదు...



వంటగ్యాస్ ధరను నిత్యం పెంచడంతో సామాన్య ప్రజలపై పెనుభారం పడుతోంది. ఇప్పటికే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ఏమి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో గ్యాస్ ధర రూ.1176కి చేరింది. గ్యాస్‌పై వంట చేసుకునే పరిస్థితి లేదు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి.

– దోమల రాధిక, గృహిణి, నాగారంబంగ్లా

గ్యాస్ ధర పెంచడం హేయమైన చర్య



కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను ఒకేసారి రూ.50 పెంచడం హేయమైన చర్య. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వం ఇలా ధరలు పెంచుతూపోతే సామాన్యులు బతికేదెలా.

– సంపెట కాశయ్య, ఏఐకేఎంఎస్, డివిజన్ అధ్యక్షుడు, డి.కొత్తపల్లి

పెరిగిన గ్యాస్ ధరలపై బీఆర్‌ఎస్ యుద్ధ భేరి

- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో.. 3న మండల కేంద్రాల్లో ధర్నాలు
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: పెరిగిన వంట గ్యాస్ ధరలపై బీఆర్ఎస్ పార్టీ యుద్ధభేరి మోగించింది. ఈ మేరకు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వారిని సన్నద్ధం చేశారు. పార్టీ పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ ఉదయం నియోజకవర్గ కేంద్రాల్లో, 3వ తేదీ ఉదయం మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అటు నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు మహిళలు అధికంగా పాల్గొనేలా చూడాలని మంత్రి కోరారు.

టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారం అందించాలి
- సమయం వృథా చేయకుండా చదువు కోవాలి
- ఉపాధ్యాయుల పాత్ర – తల్లిదండ్రుల బాధ్యత – విద్యార్థుల పాత్రపై కలెక్టర్ వెంకట్రావు సందేశం



సూర్యాపేటటౌన్ : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. ఏప్రిల్‌లో జరగబోయే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్ర– తల్లిదండ్రుల బాధ్యత– విద్యార్థుల పాత్ర ఎలా ఉండాలనే విషయమై కలెక్టర్ తన సందేశంలో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి తమ పిల్లలకు విద్య నేర్పించడం ద్వారా సమాజానికి అవసరమైన ఉత్తమ పౌరులను అందజేయడం లక్ష్యంగా ఏర్పర్చుకుంటారని చెప్పారు. సబ్జెక్టు ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేసేలా అధికారులు ఈ విజయ సాధనలో కృషి చేయాలని ఆదేశించారు.

అభ్యాసం చేయించాలి

పరీక్ష పత్రాల పట్ల పూర్తి అవగాహన కలిగించి అందుకు అనుగుణంగా స్లిప్, మోడల్ టెస్టులు నిర్వహించాలన్నారు. మంచి మార్కులు సాధనపై దృష్టి పెట్టి పాఠశాలలో బాగా అభ్యాసం చేయించాలన్నారు. పరీక్ష రాసే విధానంలో మెళకువలు, అనుసరించాల్సిన పద్ధతులను వివరించాలన్నారు. షెడ్యూల్‌కు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని, 10 జీపీఏ వచ్చే అవకాశం ఉన్న పిల్లలను అలాగే ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్న పిల్లలను గుర్తించి తగు విధంగా రెమెడియల్ టీచింగ్ చేయాలన్నారు. స్లిప్ టెస్టులు, వీక్లీ టెస్టుల్లో సాధించిన మార్కులు నమోదు చేసి వారి ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలి. మొబైల్ వాడకం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. పరీక్షల పట్ల భయాందోళనలు లేకుండా, మానసిక స్థైర్యాన్ని నింపే విజయగాథలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరు కాని విద్యార్థుల విషయమై వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి

విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు విధిగా హాజరుకావాలన్నారు. ఉత్తమ ఫలితాల కోసం స్లిప్ , వారాంతపు, ప్రీఫైనల్ పరీక్షలకు తప్పక హాజరు కావాలన్నారు. సబ్జెక్టుల్లో సందేహాలను సంబంధిత ఉపాధ్యాయుల సహకారంతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయుల సూచనల మేరకు ఇంటి వద్ద సాధన చేయాలని, సమయం వృథా చేయకూడదని, టీవీ, మొబైల్ లాంటి ఎల్రక్టానిక్ సాధనాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఉపాధ్యాయులతో చర్చించాలి

తల్లిదండ్రులు వీలైన సమయంలో పాఠశాలకు వెళ్లి పిల్లల ప్రగతిపై ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో చర్చించాలన్నారు. పిల్లలు ఉదయం 5గంటలకు నిద్రలేచి కఠినతరమైన సబ్జెక్టులు చదివేలా చూడాలన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న విషయం గమనించాలన్నారు. పిల్లలు ప్రత్యేక తరగతులకు తప్పని సరిగా హాజరయ్యేలా, మోడల్ పేపర్లు సాధన చేస్తూ, స్లిప్ , వీక్లీ టెస్టులు, ప్రీ ఫైనల్ పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఈ సమయంలో పిల్లలకు ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష జరిగే రోజుల్లో నిర్దేశించిన సమయానికి గంట ముందే సెంటర్‌కు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ..



గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఠాక్రే, చిత్రంలో ఉత్తమ్, పద్మావతి

- కోదాడ పట్టణంలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే
- హారతులతో స్వాగతం పలికిన మహిళలు

కోదాడ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే.. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కోదాడ పట్టణంలోని మాతా నగర్‌లో బుధవారం రాత్రి భారీర్యాలీగా వెళ్లి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. పలువురు మహిళలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. రాహుల్‌గాంధీ జోడో మాత్ర సందేశాన్ని వారికి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు ఇంటి తలుపులకు స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా పలువురి ఇంటి ముందు మెట్లపై కూర్చొని ముచ్చటించారు. వారితో కలిసి తేనీరు సేవించారు. ఠాక్రే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పని చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వారికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పద్మావతి, స్థానిక నాయకులు వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, వరప్రసాదరెడ్డి, బషీర్, బాగ్దాద్, చింతల పాటి శ్రీనివాస్, బాలిరెడ్డి తదితరులు ఉన్నారు.

దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

భానుపురి (సూర్యాపేట) : పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భూపాలపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆయన అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూర్‌–ఎస్(సూర్యాపేట) : 40 శాతంపైన వైకల్యం ఉండి, 21 నుంచి 55సంవత్సరాల లోపు గల దివ్యాంగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్‌బాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 31 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈనెల 6వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరం, కులం, ఆదాయం, ఆధార్, రేషన్ కార్డ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుక్కల నివారణపై దృష్టి పెట్టండి

- తాగునీటి సమస్య పరిష్కరించాలి
- విలీన గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించండి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌కు ప్రజల వినతి
- కుక్కలు, పందులు, కోతుల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక: మున్సిపల్ కమిషనర్ వెల్లడి

సూర్యాపేట: మున్సిపాలిటీ పరిధిలో కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని వీటి బెడద లేకుండా దృష్టిసారించాలని పలువురు ప్రజలు కోరారు. కుక్కలు, కోతులు బెడద, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై బుధవారం సాక్షి ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మున్సిపాలిటీలో నెలకొన్న కొన్ని సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సావధానంగా విన్న కమిషనర్ వాటిని నోట్ చేసుకుని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ప్రతి ఇంటికి మిషన్‌భగీరథ నీటిని అందించేలా పైపులైన్లు వేసినట్లు తెలిపారు. అలాగే డ్రెయినేజీ నిర్మాణం, కుక్కలు, పందులు, కోతుల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు.



'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ పెదబల్లి రామానుజులరెడ్డి

ప్రశ్న : కుక్కడ బెడదను నివారించండి
– ఉమ, ఎన్టీఆర్ కాలనీ

కమిషనర్ : పట్టణంలో కుక్కల బెడదను నివారించడానికి ప్రత్యేక దృష్టి సారించాం. ప్రణాళికతో వాటిని నియంత్రించే పనిలో ఉన్నాం. పట్టణం నుంచి వాటిని వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : పందుల బెడదను నివారించండి, చెత్తను తొలగించండి.
– రాము, విద్యానగర్

కమిషనర్: పట్టణం నుంచి పందులను ఇప్పటికే వేరే ప్రాంతాలకు తరలిస్తున్నాం. పందుల వ్యాపారులకు పట్టణానికి దూరంగా షెడ్లు నిర్మించి, వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విలీన గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించండి
– రేణుక, పిల్లలమర్రి

కమిషనర్ : సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం. వీటితో పాటుగా విలీన గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మిస్తాం. పారిశుద్ధ్య పనులు కూడా చేస్తాం.

ప్రశ్న : తాగునీరు నాలుగు రోజుల నుంచి రావడం లేదు
– సత్యనారాయణ, 21వ వార్డు

కమిషనర్ : తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నాం. గురువారం నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తాం. నీటి సమస్య లేకుండా చేస్తాం.

ప్రశ్న : గాంధీనగర్‌లో డ్రెయినేజీలు నిర్మించాలి.
– పార్వతి, గాంధీనగర్

కమిషనర్ : విలీన గ్రామాల్లో డ్రెయినేజీల నిర్మాణంపై దృష్టి పెట్టాం. ఇప్పటికే డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాం. గాంధీనగర్‌లో త్వరలోనే డ్రెయినేజీల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: కాలనీలో డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. కాలువలన్నీ కంపు కొడుతున్నాయి. కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది.
– సుష్మ, శంకర్‌విలాస్‌సెంటర్

కమిషనర్ : పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి కాలనీకి ఒక జవాన్‌ను కేటాయించి డ్రెయినేజీలను శుభ్రం చేసేలా పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించాం. సంబంధిత కాలనీకి జవాన్ ఎవరనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా అతని పేరు, సెల్ నంబర్‌ను కాలనీల్లోని గోడలపై రాయిస్తాం. డ్రెయినేజీ శుభ్రం చేయకుంటే కాలనీవాసులు ఆ జవాన్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలి. కుక్కల సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడతున్నారు.
– శంకర్, వాణిజ్యభవన్ సెంటర్

కమిషనర్ : వాణిజ్యభవన్ సెంటర్‌కు వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులను పంపించి అక్రమ నిర్మాణాలపై దృష్టిసారిస్తాం. అనుమతులు ఒకలా ఉండి.. నిర్మాణాలు మరోలా ఉంటే చర్యలకు వెనుకాడేది లేదు. అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చేస్తాం.

ప్రశ్న : శ్రీరాంనగర్‌లో పారిశుద్ధ్య సమస్య నెలకొంది.
–రమ్యశ్రీ, శ్రీరాంనగర్

కమిషనర్ : ప్రతిరోజూ కాలనీల్లో చెత్త సేకరణ చేయాలని ఇప్పటికే పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించాం. చెత్త సేకరణవాహనాలు వచ్చేలా చర్యలు చేపడతాం.

ప్రశ్న : పట్టణంలో పలుచోట్ల అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించాలి.
– సరిత, జనగాం క్రాస్‌రోడ్డు

కమిషనర్: పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తక్షణమే తొలగించేలా చర్యలు చేపడతాం. వీటి వల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని మాదృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరిస్తాం.

క్లుప్తంగా

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



కోదాడ : పది పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న సీతారామ్

చివ్వెంల(సూర్యాపేట) : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. క్రమశిక్షణ పట్టుదలతో చదవి భావిపౌరులగా ఎదగాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడఅర్బన్ : వసతి గృహాల్లో ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. వసతి గృహ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసత గృహ సంక్షేమాధికారి వంగపల్లి పద్మ, పాఠశాల సిబ్బంది సుజాత, స్వరూప, రేణుక, ఉషా, రెహానా, స్వాతి, ప్రమీల, సావిత్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రామగిరి(నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలం కోర్లపహాడ్‌కు చెందిన సూరారపు కృష్ణయ్య (48) బుధవారం బొల్లేపల్లిలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం రాత్రి మరో వ్యక్తితో కలిసి బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో చిన్నసూరారం సమీపంలో నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ) : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన చిలుమలు రాజేష్(40)కు వెంకటాద్రిపాలెం పల్లె నాగయ్య కుమార్తె మౌనికతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్య పిల్లలలో కలిసి మిర్యాలగూడలో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజేష్‌కు కొన్ని రోజులుగా మానసికంగా స్థితి సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు వెంకటాద్రిపాలెం వచ్చారు. మంగళవారం రాత్రి రాజేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు రోజంతా వెతికారు. సాయంత్రం పజ్జూరు చెరువులో శవమై తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై రాత్రి వరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

శ్రీమహావిష్ణువుగా దర్శనమిచ్చి..



స్వామివారి సేవలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి



రథాంగ హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

- గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు
- యాదాద్రిలో కనుల పండువగా దివ్య విమాన రథోత్సవం
- తిరుమాఢ వీధుల్లో విహరించిన కల్యాణ మూర్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆచార్యులు, పారాయణికులు, రుత్వికుల పఠనాలతో ఆలయమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీదేవిని శ్రీనృసింహస్వామి వారు పరియణమాడగా.. బుధవారం ఉదయం స్వామి వారు శ్రీమహా విష్ణు అలంకారములో గరుడవాహనంపై ఊరేగి.. రాత్రి దివ్య విమాన రథోత్సవంపై ఆలయ మాఢ వీధుల్లో విహరించారు.

ఉదయం నుంచే..

ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం స్వామివారిని గరుడవాహనంపై శ్రీ మహా విష్ణు అలంకార సేవలో మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పడమటి రాజగోపురం ముందు గల వేంచేపు మండపంలో అధిష్ఠింపజేశారు. స్వామివారికి వేద పారాయణం చేసిన అనంతరం, అలంకార విశిష్టతను ప్రధానార్చకులు వివరించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య విమాన రథంపై..

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి వారి ఆలయంలో నిత్యారాధనలు జరిపించారు. అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్ప పఠనాదులు, పురాణ, ఇతిహాస, విజ్ఞాపనలు నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, ఉత్సవ మూర్తుల అలంకార సేవ ఊరేగింపు గావించారు. రాత్రి వేళ స్వామివారిని ఆలయ మాఢ వీధుల్లో దివ్య విమాన రథోత్సవంపై ఊరేగించారు. భక్తుల జయ నారసింహ అంటూ నినాదాలు, బ్యాండ్ మేళాలు, భజంత్రీల చప్పుళ్ల నడుమ, బాణసంచాల వెలుగుల్లో వైభవోపేతంగా స్వామి వారి రథోత్సవ వేడుక సాగింది. దివ్య విమాన రథోత్సవానికి ముందు ఆలయ మాఢ వీధుల్లో స్థానిక యువకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. కొండపైన రథోత్సవం సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం గంటలకు శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపోత్సవాలను జరిపిస్తారు.



స్వామివారికి హారతినిస్తున్న ప్రధానాచార్యులు



పారాయణం చేస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న కళాకారులు

కొనసాగుతున్న ధార్మిక మహాసభలు



సంగీత కచేరీ చేస్తున్న జీవీఆర్ మ్యూజిక్ అకాడమీ కళాకారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధార్మిక, సంగీత, సాహిత్య మహాసభలు కొనసాగుతున్నాయి. శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీ, యాదగిరిగుట్టకు చెందిన మిర్యాల లక్ష్మీబృందం, హైదరాబాద్ శబరిగిరీశ అయ్యప్ప భక్త బృందంచే భజన కార్యక్రమం చేపట్టారు. ఆస్థానం వారిచే మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలు నిర్వహించారు. భాస్కర బట్ల ఆంజనేయశర్మ శ్రీమత్ భాగవతాంతర్గతమైన గజేంద్రమోక్షం అనే అంశంపై ఉపన్యాసం గావించారు. పాల రామాంజనేయ భాగవతార్ సీతాకల్యాణం అను హరికథను గానం చేశారు. యాదాద్రి భజన సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. సంగీత సిస్టర్స్‌చే, జీవిఆర్ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ వారిచే భక్తి సంగీతం, డి.వి మోహనకృష్ణచే కర్ణాటక సంగీతం నిర్వహించారు. సాయంత్రం పలువురు కళాకారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. గడ్డం అంజయ్యచే చిందు యక్షగానం నిర్వహించారు. రథం ముందు శాపెల్లి వారిచే చెక్క భజన, శాలిగౌరారం వారిచే చిరుతల భజన, గడ్డం పాండు బృందంచే కోలాటం నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి



అష్టోత్తర పూజలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని బుధవారం సాయంత్రం పంచాయత్ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు మంత్రికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన వంటి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. కాగా ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

పిల్లల దత్తతకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం తమిళనాడుకు చెందిన ముత్తుకరుప్పాన్, శీగప్తి సుబ్రమాన్యాన్ దపతులకు జిల్లా శిశు గృహకు చెందిన ఐదు సంవత్సరాల పాప ప్రతీకను దత్తత ఇచ్చినట్లు తెలిపారు. సీఏఆర్‌ఏ వెబ్‌సైడ్ సందర్శించి కావాల్సిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే దత్తత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జ సైదులు ఉన్నారు.



బాలికను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బహుజనులకు అధికారం దక్కాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

భూదాన్‌పోచంపల్లి : బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని దళితశక్తి ప్రోగ్రామ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. విశారదన్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బుధవారం మండలంలోని జూలూరు, ముక్తాపూర్, రేవనపల్లి గ్రామాల మీదుగా రాత్రి పోచంపల్లికి చేరుకొంది. వీరికి ఆయా గ్రామాల్లో దళిత సంఘాల నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లను అమ్ముకొని బానిసలుగా ఉందామా మన ఓట్లు మనం వేసుకొని పాలకులవుదామని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఇప్పటివరకు పద్మశాలి, చాకలి, మంగళి సామాజిక వర్గాలనుంచి ఎమ్మెల్యే కాలేకపోవడం దురదుష్టకరమని అన్నారు. తెలంగాణలో రెడ్ల, వెలమదొరల రాజ్యాన్ని దింపి అణగారిన వర్గాలకు అధికారంలోకి తీసుకరావడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాలు ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్పీ జెండా, శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇంచార్జ్ లక్ష్మణ్, డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బహుజన శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, ు చింతకింది రమేశ్, వెంకటేశ్, కొమ్ము లక్ష్మన్, నర్సింగ్, గాలయ్య, సంజీవ్, నర్సింహ, సాయికిరణ్ పాల్గొన్నారు.

నేడు భువనగిరి మున్సిపల్ మడిగెల వేలం

- 29 దుకాణాలకు 65 దరఖాస్తులు



ఖాళీగా ఉన్న మడిగెలు

భువనగిరి : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఉన్న మున్సిపల్ మడిగెలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నారు. మొత్తం 66 మడిగెలు ఉండగా ఇప్పటికే 37 మడిగెలను వ్యాపారులకు కేటాయించారు. మిగిలిన 29 మడిగెలు ఆరు నెలలుగా ఖాళీగా ఉన్నాయి. వీటిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు.

రూ.2,200తో వేలం పాట ప్రారంభం

మున్సిపల్ మడిగెల కోసం దరఖాస్తు గడువు ఈనెల 1వ తేదీతో ముగిసింది. 29 మడిగెలకు గాను 65 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా నేడు నిర్వహించే వేలం పాటలో పాల్గొననున్నారు. మడిగెకు రూ.2,200తో వేలం పాట ప్రారంభం కానుంది. ఈ మడిగెలకు పలుమార్లు వేలం నిర్వహించినా వీటిలో వ్యాపారాలు జరగవన్న ఉద్దేశంతో తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపే వారు కాదు. ఈసారి రెండింతలు దరఖాస్తులు రావడంతో ఆసక్తిగా మారింది.

దరఖాస్తుదారులు వేలంలో పాల్గొనాలి

మున్సిపాలిటీకి చెందిన 29 మడిగెలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తాం. దరఖాస్తు దారులు సకాలంలో హాజరుకావాలి. మడిగెల వేలం పార పాదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలి
- పోలీస్ సిబ్బందికి రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశం



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

సాక్షి, యాదాద్రి : వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. భువనగిరి జోన్ పోలీస్ అధికారులతో బుధవారం నిర్వహించిన క్రైమ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి బాధలను ఓపికగా విని సత్వర న్యాయం చేయాలని సూచి ంచారు. ప్రతి గ్రామంలో అవసరమైన మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి న్యాయం చేకూర్చాలన్నారు. భూ కబ్జాదారులు, హైవే దిగ్బంధం చేసే వారిని ఉపేక్షించవద్దని చెప్పారు. యాదాద్రి భువనగిరి జోన్‌లోని ఆయా స్టేషన్ల అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు.

భక్తులకు సీపీ ధన్యవాదాలు

యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖకు సహకరించిన భక్తులకు సీపీ ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాల ముగింపు సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సైదులు, ఉదయ్‌రెడ్డి, భువనగిరి జోన్ సీఐ, ఎస్‌హెచ్‌ఓ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

టాటాఏస్ వాహనం బోల్తా... డ్రైవర్‌కు గాయాలు



అదుపు తప్పి బోల్తాకొట్టిన వాహనం

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని బండమీది గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పత్తిలోడుతో సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న టాటాఏస్ వాహనం మార్గమధ్యలో బి.చందుపట్ల వద్ద అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శేషగిరి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్త సూర్యాపేటకు తరలించారు. కాగా, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకున్న పోలీసులు

- పోచంపల్లిలో దళిత సంఘాల నాయకులు, పోలీసులకు తీవ్ర వాగ్వాదం
- ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని నిరసన



చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ పెద్దల చక్రపాణి

భూదాన్‌పోచంపల్లి : జెండీ దిమ్మె ఏర్పాటుపై దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు, పోలీసులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ విశారదన్ స్వరాజ్య పాదయాత్ర బుధవారం పోచంపల్లికి వస్తున్న క్రమంలో దళితశక్తిప్రోగ్రామ్ జెండావిష్కరణ చేయడానికిగాను నిర్వాహకులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో దిమ్మె ఏర్పాటు చేస్తుండగా మున్సిపల్ అధికారులు తొలగించారు. చివరకు స్థానిక దళిత కౌన్సిలర్ పెద్దల చక్రపాణి జోక్యం చేసుకొని రాత్రి తిరిగి దిమ్మెను నిర్మిస్తున్న క్రమంలో సమాచారం అందుకొన్న ఎస్‌ఐ సైదిరెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకొన్నాడు. దాంతో ఎస్‌ఐ, కౌన్సిలర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కౌన్సిలర్‌ను పోలీసులు జీపులో ఎక్కిస్తున్న క్రమంలో తోపులాట జరిగి అతని చొక్కా చిరిగింది. దాంతో ఆగ్రహించిన కౌన్సిలర్, అతని మద్దతుదారులు పోలీసుల తీరును నిరసిస్తూ అర్ధరాత్రి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకొన్న చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రూరల్‌సీఐ మహేశ్, వెంటనే సంఘటన స్థలానికి చేరుకొన్నారు. రాత్రి పూట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని వినతి..

పెద్దల చక్రపాణి దళిత ప్రజాప్రతినిధినైన తనపై దాడి చేసిన ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. దుర్భాషలాడిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏసీపీ స్పందిస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండా విగ్రహాలు, దిమ్మెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పోలీస్ పహారాలో దుకాణాల తొలగింపు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ దండ మైసమ్మ ఆలయం వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా బుధవారం రోడ్డు వెంట ఉన్న షాపులు, అక్రమ కట్టడాలను పోలీస్ పహారాలో అధికారులు తొలగించారు. ఆలయం విస్తరించడం.. రోడ్డు పై ట్రాఫిక్ సమస్య పెరగడం కారణంగా ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆర్ అండ్ బి రోడ్డుకు ఉన్న షాపులను, కట్టడాలను వెంటనే తొలగించి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. బుధవారం ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ షాపులను జేసీబీలతో తొలగించారు. ఆర్ అండ్ బి రోడ్డు 100 ఫీట్ల వరకు విస్తరించి ఉందని, ఆక్రమించిన షాపులు మాత్రమే తొలగించామని ఆర్‌అండ్‌బి ఈఈ యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ మల్సూర్ నాయక్,, తుంగతుర్తి సీఐ నాగార్జున గౌడ్, ఎస్‌ఐ యాదవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిషన్' నీరు వరదలా..

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం పగిలిపోయింది. దీంతో నిరంతా జడ్చర్ల –కోదాడ ప్రధాన రహదారిపై వరదలా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేడంతో మిర్యాలగూడ మండలంలోని అవంతిపురంలోని మిషన్ భగీరథ హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని నిలుపుదల చేశారు.

– నేరేడుచర్ల



మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

పాడి పంట



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నడిగూడెం: ప్రస్తుత సీజన్‌లో వరిలో చీడపీడల సమస్య అధికంగా ఉంది. దీంతో రైతులు వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు క్రిమిసంహారక మందులు చల్లుతున్నారు. పంట కాలంలో నాలుగు నుంచి ఆరుసార్లు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే పురుగు మందులను వాడే విధానం తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు అస్వస్థతకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయన మందులను వాడుతున్నారు. మందులు కలిపే సమయంలో ఎటువంటి గ్లౌజులు ఉపయోగించకుండా చేతులు, కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మందులు పిచికారీ చేసిన తర్వాత భోజనం చేయడం, నీళ్ల తాగడం, పొగ తాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యకృత్యాలకు వాడుకుంటున్నారు. పురుగు మందుల పిచికారీలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు మాటల్లోనే..

- పురుగు మందులు పిచికారీ చేసే ముందు తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా హెల్మెట్ వంటివి ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, సిగరెట్ వంటివి తాగడం చేయరాదు.
- పిచికారీ పూర్తయ్యి స్నానం చేసిన తర్వాతే ఆహారం తీసుకోవాలి.
- పురుగు మందులను గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే మందులు పిచికారీ చేయడం మంచిది.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు మూడు కలిపి పిచికారీ చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.